

31 వరకు పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 31 వరకు విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్(18526/18525), విశాఖ-భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (22820/22819), విశాఖ-కొరాపుట్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (18512/18511), విశాఖ-రాయపూర్-విశాఖ పాసింజర్ (58528/58527), విశాఖ-కొరాపుట్-విశాఖ పాసింజర్ (58538/ 58537), విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58532/58531), విశాఖ-భవానీపట్న-విశాఖ పాసింజర్ (58504/58503) రెండేసి జనరల్ కోచ్‌లు జత చేశామన్నారు.

ఆటో డ్రైవర్ల సేవలో.. కూటమి సర్కారు

జిల్లాలో 13,753 మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు లబ్ధి

- వారి బ్యాంకు ఖాతాల్లో రూ.20,62,95,000 జమ
- రాష్ట్రంలో 60 శాతం మందికి సంక్షేమ ఫలాలు
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్

నర్సీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా జిల్లాలో 13,753 మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.20 కోట్ల 62 లక్షల 95 వేలు లబ్ధి చేకూరుతుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌తో కలిసి ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో 60 శాతం మంది ప్రజలు ఈ పథకాల వలన లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యతను నాయకులు తీసుకోవాలన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తున్నప్పటికి మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలతో మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని, బయట నుంచి మాట్లాడడం కాదని చెప్పారు. అసెంబ్లీకి వస్తే అందరు ఎమ్మెల్యేలకు ఇచ్చినట్టే అవకాశం ఇస్తానన్నారు. స్పీకర్.. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్‌మోహన్‌రెడ్డి అంటున్నారని, ఇచ్చే అధికారం తనకు లేదని చాలా సార్లు చెప్పానని స్పష్టం ... మిగతా 6వ పేజీలో

ఆటో నడిపిన ఎంపీ సీఎం రమేశ్

- ప్రయాణించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర



ఎంపీ సీఎం రమేశ్ ఆటో నడుపుతుండగా ప్రజలకు అభివాదం చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఖాకీ చొక్కా ధరించి కొద్ది సేపు ఆటో డ్రైవర్ అవతారం ఎత్తారు. శనివారం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఎంపీ రమేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర ఖాకీ చొక్కాలు ధరించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో సెల్ఫీలు దిగడానికి ఆటో డ్రైవర్లు ఎగబడ్డారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డు వరకు ఎంపీ సీఎం రమేశ్ డ్రైవర్ సీట్లో కూర్చొని ఆటో నడిపారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయకృష్ణన్ ఆటోలో కూర్చున్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ నర్సీపట్నం నుంచి పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డు వరకు ఆటోలో ప్రయాణించారు.

గోవాడను ఆదుకోండి

షుగర్స్ కర్మాగారంతో వేలాది మంది రైతులకు అనుబంధం

- ఎరువుల కొరతపై సభ్యుల ఆందోళన
- ప్రొటోకాల్‌ఉల్లంఘనలపై బాహాబాహీ
- మూడు అంశాలపై జడ్పీ సమావేశం తీర్మానం



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర. పక్కన జేసీ జాహ్నవి

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో వేలాది మంది రైతులతో అనుబంధం ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని పలువురు జడ్పీటీసీ సభ్యులు కోరారు. శనివారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన జడ్పీ సర్వ సభ్య సమావేశంలో గోవాడ షుగర్స్‌పై బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు చర్చ ప్రారంభిస్తూ ప్రస్తుతం కర్మాగారం నిర్వీర్యమైపోయిందని, వేలాది మంది రైతులకు కోట్ల రూపాయలు బకాయిలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాడుగుల ఎంపీపీ టి.రాజారామ్ మాట్లాడుతూ కొందరు అధికారుల అవినీతి వలన షుగర్స్ కర్మాగారం నష్టాల్లో కూరుకుపోయిందని, ఉత్పత్తి చేసిన పంచదార పాడైందని, రైతులు నష్టపోయారని తెలిపారు. ఈ దశలో షుగర్స్ ఎండీ మాట్లాడుతూ ప్రస్తుతం కర్మాగారానికి రూ.101 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంటూ రైతుల బకాయిలు విడుదల చేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. అనకాపల్లి జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు మాట్లాడుతూ గతంలో 30 వేల హెక్టార్లలో పండించే చెరకు ఇప్పుడు 3,500 హెక్టార్లకు పడిపోయిందన్నారు. ఈ దశలో శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కర్మాగారం తెరుస్తారా?, లేదా? అనేది ప్రభుత్వం చెప్పాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత పాలకులదేనని అన్నారు. గోవాడ షుగర్స్ కర్మాగారం రక్షణకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతూ తీర్మానం చేయాలని సూచించడంతో సమావేశం తీర్మానించింది. సమావేశానికి కలెక్టర్లు హాజరుకాకపోవడంపై ఆయన స్పందిస్తూ శనివారం ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తున్నందున అధికారులు దానికే తొలి ప్రాధాన్యం ఇస్తారని పేర్కొన్నారు. దేవరాపల్లి, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యులు కర్రి సత్యం, ఈర్లె అనురాధ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దేవరాపల్లి మండలంలో కొన్ని గ్రామాలకు ఎక్కువగా యూరియా కేటాయించి, మరికొన్ని గ్రామాలకు తక్కువగా ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించగా, వ్యవసాయశాఖాధికారి మోహనరావు బదులిస్తూ ఖరీఫ్‌లో ఆగస్టు 15వ తేదీ తరువాత వర్షాలు ప్రారంభంకావడంతో సెప్టెంబరు ... మిగతా 6వ పేజీలో



ప్రొటోకాల్‌పై నిరసన తెలుపుతున్న వైసీపీ జడ్పీటీసీ సభ్యులు

జడ్పీలో రాజకీయం

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయమన్నట్టు వ్యవహరిస్తున్న వైసీపీ సభ్యులు

- గందరగోళంగా సర్వసభ్య సమావేశాలు
- ఒక్కొక్క అంశంపై గంటల తరబడి సాగదీత
- కాలం సద్వినియోగంలో సభ్యులు విఫలం
- నాలుగేళ్లలో చర్చకు రాని శాఖలు ఎన్నో

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలను వైసీపీ సభ్యులు రాజకీయ వేదికలుగా మార్చుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ ప్రాంతాల్లో సమస్యలను ప్రస్తావించాల్సిన సభ్యులు కేవలం పార్టీ అజెండానే భుజాన వేసుకుని సమావేశాలను హైజాక్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయమన్నట్టు వ్యవహరిస్తున్నారు. ప్రజలచే ఎన్ని ... మిగతా 6వ పేజీలో

చెరువులు కళకళ

పంట కుంటల్లో చేరిన నీరు

- తీరనున్న సాగునీటి అవసరాలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాగునీటి చెరువులు, పంట కుంటలు ఇటీవల కురిసిన వర్షాలకు కళకళలాడుతున్నాయి. దీంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కళకళలాడుతున్న కె.కోటపాడు మండలం కె.గుల్లిపల్లిలోని చెరువు



అనకాపల్లి మండలం తగరంపూడిలో తవ్విన పంట కుంటలో చేరిన వర్షపు నీరు

అనకాపల్లి, చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, మండలాల్లో చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాగునీటి వనరులకు జవసత్వాలు నింపేందుకు జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువుల్లో పూడికతీత పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేసింది. కొండవాగు ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటిని సంరక్షించేందుకు 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ పథకంలో భాగంగా 5,514 పంట ... మిగతా 6వ పేజీలో

జోరు వాన

గంట సేపు కుండపోత వర్షం

- రహదారులు జలమయం

సబ్బవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు కుండపోతగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమ య్యాయి. సబ్బవరం- చోడవరం రోడ్డు గొర్లివానిపాలెం, వంగల జంక్షన్ వద్ద వరద నీరు భారీగా చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. విశాఖపట్నం నుంచి చోడవరం, అలాగే చోడవరం నుంచి విశాఖపట్నం రాకపోకలు సాగించి ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో 2 నుంచి 3 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని వాహనాలను గొర్లివానిపాలెం మీదుగా ట్రాఫిక్ మళ్లించినా ఆ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పలేదు. కాగా సబ్బవరం మొదలుకొని చోడవరం రోడ్డులో బంగారమ్మపాలెం వరకు ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురికావడంతో వరద నీరు ప్రవహించే అవకాశం లేక రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీని వలన వర్షాలు కురిసినప్పుడల్లా ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చోడవరం రోడ్డులోని గొర్లివానిపాలెం జంక్షన్ వద్ద జలమయమైన రహదారి



చోడవరం రోడ్డులో లగిశెట్టిపాలెం వద్ద జలమయమైన పెట్రోల్ బంకు

పిడుగుపాటుకు రైతు మృతి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమదీనా గ్రామంలో పిడుగుపాటుకు ఒక రైతు మృతి చెందాడు. దీనికి సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చినమదీనా గ్రామానికి చెందిన సియాద్రి అప్పలనాయుడు (54) శనివారం మధ్యాహ్నం గేదెలను మేపడానికి సమీపంలోని పొలానికి తోలుకెళ్లాడు. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పొలంలో ఉండిపోయాడు. ఆ సమయంలో అతనిపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.



అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

తిరుగు ప్రయాణాల రద్దీ

ఆర్టీసీ బస్సులు కిటకిట



పాయకరావుపేట బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న ప్రయాణికులు

పాయకరావుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు ముగియడంతో స్వగ్రామాల నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారితో శనివారం ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి జిల్లాలో అనకాపల్లి వరకు, అదే విధంగా కాకినాడ, రాజమహేంద్రవరం వరకు పల్లె వెలుగు సర్వీసులు రోజూ పదుల సంఖ్యలో నడుస్తుండగా, శనివారం బస్టాండుకు వచ్చిన ప్రతి బస్సు ప్రారంభం నుంచే కిక్కిరిసిన ప్రయాణికులతో బయలుదేరాయి. బస్టాండుకు వచ్చిన ప్రతి బస్సులో ప్రయాణికులు దిగకుండానే బస్సు ఎక్కేందుకు ఫుట్‌పాత్ వద్దకు అధిక సంఖ్యలో ప్రయాణికులు చేరుకోవడంతో చిన్నపాటి తోపులాటలు జరిగాయి. దీంతో పిల్లలతో వచ్చినవారు బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు.

అనకాపల్లి నుంచి తిరుపతికి

ప్రత్యేక రైలు రేపు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 6న అనకాపల్లి నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నడపనుంది. 07481 నంబరుతో ఈ ప్రత్యేక రైలు 5వ తేదీ రాత్రి ఎనిమిది గంటలకు తిరుపతిలో బయలుదేరి శ్రీకాళహస్తి, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి మీదుగా 6వ తేదీ ఉదయం తొమ్మిదిన్నర గంటలకు అనకాపల్లికి చేరుకుంటుంది. తిరిగి అనకాపల్లి నుంచి 6వ తేదీ సాయంత్రం 07482 నంబరుతో ఈ రైలు 5.35 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆగి 7వ తేదీన ఉదయం 7.40 గంటలకు తిరుపతి చేరుకుంటుందని అనకాపల్లి రైల్వే స్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్ తెలిపారు. ఈ నెలాఖరు వరకు వారంలో ఒక రోజు ఈ రైలు అందుబాటులో ఉండే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

నిత్యం ఇదేం సంత

కూరగాయల మార్కెట్ వద్ద తరచూ ట్రాఫిక్ కష్టాలు

- శనివారం సంత రోజు మరీ ఇబ్బందులు
- అధిక సంఖ్యలో టిప్పర్ల రాకపోకలతో అవస్థలు



డిగ్రీ కళాశాల దగ్గర కూరగాయల మార్కెట్లో నిలిచిపోయిన వాహనాలు

నర్సీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):

అసలే తరచూ ట్రాఫిక్ కష్టాలు.. దీనికి తోడు అధిక సంఖ్యలో టిప్పర్ల రాకపోకలు.. ఫలితంగా గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు.. ఇదీ డిగ్రీ కళాశాల సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద పరిస్థితి. ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కరోనా సమయంలో నర్సీపట్నం ఇందిరా మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారుల్లో కొందరిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు, మరికొందరిని పెదబొడ్డేపల్లి మార్కెట్ కమిటీ రైతు బజార్ ప్రాంగణంలోకి తరలించారు. డిగ్రీ కళాశాల వద్ద రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు తాత్కాలికంగా షెడ్లు, నేల దుకాణాలు వేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. శనివారం సంత రోజు కూరగాయల మార్కెట్‌లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఏజెన్సీకి తిరిగే బస్సులు, కూరగాయలతో వచ్చే వ్యాన్లు, ఆటోలతో పాటు భారీ టిప్పర్లు ఇసుక లోడుతో అధికంగా తిరుగుతుండడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధిక సంఖ్యలో టిప్పర్లు చింతపల్లి వైపు నుంచి అబీద్ సెంటర్ మీదుగా తుని రోడ్డులోకి వెళుతున్నాయి. శనివారం ఉదయం టిప్పర్ల రాకపోకల వలన మార్కెట్లో అరగంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల మార్కెట్ లోంచి వాహనాలు తిరగడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, కోర్టు ప్రాంగణం ఉన్నాయి. అయ్యన్నకాలనీ, నీలంపేట, గబ్బాడ ప్రజలు నర్సీపట్నానికి రాకపోకలు సాగిస్తుంటారు. కూరగాయల మార్కెట్ నుంచి ... మిగతా 6వ పేజీలో

ఆటో కార్మికులకు అండగా ప్రభుత్వం

» ఎమ్మెల్యే సుందరపు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ » 'ఆటో డ్రైవర్ల సేవలో' భాగంగా రూ.2.96 కోట్ల సాయం అందజేత



ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్డుపై 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగానే అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ తూ.చ. తప్పక అమలు చేస్తున్నామన్నారు. ఆటో రిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్‌ల డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల సాయం అందించాలనే గొప్ప ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. నియోజకవర్గంలో 1,976 మంది ఆటో డ్రైవర్లకు రూ.2.96 కోట్ల సహాయం అందించడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలనను కూటమి ప్రభుత్వం సాగిస్తుందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే సుందరపు, ప్రగడ ఖాకీ చొక్కాలు ధరించి ఆటోలను నడిపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రతినిధి కర్రి సాయికృష్ణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, జనసేన ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీష్, టీడీపీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, నాయకులు ఆడారి మంజు, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, లాలం భరత్, పీలా తులసీరామ్, పెంటకోట విజయ్, కర్రి ఝాన్సీ, అందే రమణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో 'టాస్క్ ఫోర్స్' తనిఖీ



ఆయుష్మాన్ కేంద్రంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న బృందం సభ్యులు

మునగపాక, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిపల్లి గ్రామంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందంలోని ప్రతినిధులు కె.జగదీష్, ఎ.రామచంద్రరావు, జనార్ధన్ తదితరులు ఓపీ, వైద్య సేవలు, మందులు, వ్యాక్సిన్లు తదితర వివరాలపై ఆరా తీశారు. మాతా, శిశు సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఆర్.దేవకాంత, సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

రాంబిల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజుకోడూరు గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద అసైన్డ్ భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆ గ్రామ మాజీ సర్పంచ్ రావి చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్లు 257, 258లలో రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో గత పదిహేను రోజులుగా కంకర తవ్వకాలు చేపట్టి, రాజుకోడూరు నుంచి పంచదార్ల చెరువు వరకు వేస్తున్న రోడ్డుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి పరిస్థితులపై రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు సమాచారం అందించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. తక్షణమే విచారణ జరిపి అక్రమ తవ్వకందారులపై చర్యలు చేపట్టాలని విన్నవించినట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు విద్యారంభ ధ్రువపత్రాలు

మునగపాక, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు శనివారం విద్యారంభ ధ్రువపత్రాలను సర్పంచ్ దిమ్మల అప్పారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో వేణుగోపాలరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాల వయస్సు పూర్తయిన బాల బాలికలకు 5 ప్లస్ పేరుతో ఈ పత్రాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఇవి పాఠశాలల్లో చేరేందుకు దోహదపడతాయన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు కళకళ

... 5వ పేజీ తరువాయి

కుంటలను తవ్వకాల పనులను అధికారులు ప్రారంభించారు.

ఇందులో ఆగస్టు నెలాఖరు నాటికి 4,122 పంట కుంటల తవ్వకాల పనులు పూర్తి చేశారు. వీటిలో బుచ్చెయ్యపేట మండలంలో 183, అనకాపల్లిలో 78, అచ్యుతాపురంలో 186, చీడికాడలో 139, చోడవరంలో 189, దేవరాపల్లిలో 198, గొలుగొండలో 163, కె.కోటపాడులో 238, కశింకోటలో 197, మాడుగులలో 189, మాకవరపాలెంలో 240, మునగపాకలో 205, నక్కపల్లిలో 67, నర్సీపట్నంలో 150, నాతవరంలో 126, నాతవరంలో 219, పరవాడలో 44, పాయకరావుపేటలో 80, రాంబిల్లిలో 172, రావికమతంలో 288, రోలుగుంటలో 291, ఎస్.రాయవరంలో 165, సబ్బవరంలో 182, ఎలమంచిలి మండలంలో 133 ఉన్నాయి. అన్ని మండలాల్లో పంట కుంటలను తవ్వడం, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడంతో ఈ ఏడాది భూగర్భ జలాలు పెరగడమే కాకుండా సాగునీటి అవసరాలకు నీరు పుష్కలంగా అందనున్నదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. రైతులకు పండ్ల జాతి మొక్కలను పంపిణీ చేసి వాటిని పంట కుంట గట్లపై నాటించి అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళిక అమలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

ఇంగ్లీష్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

రాంబిల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లాలంకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్లం అతిథి అధ్యాపక (ఇంగ్లీష్ గెస్ట్ లెక్చరర్) పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో యాభై శాతం మార్కులు పొంది ఉండాలని వివరించారు. ఈ నెల 10 తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఆసక్తిగల వారు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, 13న కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94946 71511 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

జడ్పీలో రాజకీయం

... 5వ పేజీ తరువాయి

కైన జడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతం లేదా జిల్లాలో ప్రధాన సమస్యలను సమావేశంలో ప్రస్తావించి అవి పరిష్కారం అయ్యేలా చూడాల్సి ఉంది. కానీ, కొందరు ఆ విషయం వదిలేసి ఒకే అంశంపై లేనిపోని సందేహాలతో గంటలకొద్దీ చర్చ కొనసాగిస్తున్నారు. ప్రస్తుత జడ్పీ పాలక వర్గం ఏర్పడి గత నెల 23వ తేదీకి నాలుగేళ్లు పూర్తయ్యింది. శనివారం నాటి సమావేశంతో కలిపి ఈ నాలుగేళ్లలో 17 సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. శనివారం సమావేశంలో సభ్యులతో పాటు చైర్‌పర్సన్ కూడా కూడా నేరుగా అధికారులపై విమర్శలకు దిగడం చర్చనీయాంశమైంది. సభా వేదిక నుంచే అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌కు ఫోన్ చేసి 'జిల్లా నుంచి ఎక్కువ మంది అధికారులు రాకపోవడానికి మీ నిర్లక్ష్యమే కారణం' అంటూ వ్యాఖ్యానించడంతో పలువురు అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. సమావేశంలోనే ఉన్న విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు ప్రధానంగా కలెక్టర్లకు ప్రభుత్వ కార్యక్రమం తొలి ప్రాధాన్యం, జడ్పీ సమావేశం రెండో ప్రాధాన్యం అంటూ జడ్పీ సమావేశం వాయిదా వేసుకుని ఉండాల్సిందని పేర్కొనడం గమనార్హం. కాగా అల్లూరి జిల్లా అనంతగిరిలో రెండు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వంలోనే వచ్చాయి. వాటిపై అప్పట్లో మౌనంగా ఉన్న వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఇప్పుడు వ్యతిరేకించడం ఏమిటని సమావేశంలో సభ్యుడొకరు వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే వైసీపీ హయాంలో జిల్లాలో రహదారులు అత్యంత అధ్వానంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక రోడ్లను బాగుచేయించింది. కానీ ఆ విషయం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా విమర్శలు చేయడంతో రాజకీయ లబ్ధికోసమేననే అభిప్రాయం వ్యక్తమైంది. ఇక, ఒక్క అంశాన్ని పట్టుకుని గంటల తరబడి సాగదీస్తున్నారు. ఇదే విషయాన్ని విపక్ష నేత బొత్స సత్యనారాయణ శనివారం ప్రస్తావించి అన్ని అంశాలకు సమయం కేటాయించాలన్నారు. సమావేశం మధ్యలో ఆయన వెళ్లిపోయిన తరువాత సమస్యలను పక్కనపెట్టి ప్రొటోకాల్ అంశంపై సభ్యులు చర్చించడం గందరగోళానికి దారితీసింది. ప్రతి అంశానికి నిర్దిష్ట సమయం నిర్ణయించి చర్చించేలా అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్‌పర్సన్ చూడాలి. గడచిన నాలుగేళ్లలో అసలు చర్చకు రాని శాఖలే ఎక్కువగా ఉన్నాయి. అయినా ఆయా శాఖల అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ఆదేశిస్తారు. దీంతో రోజంతా వారు జడ్పీలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. శనివారం సమావేశాలకు హాజరుకాని అధికారులను జడ్పీ అధికారులు ఆగమేఘాలపై పిలిపించారు. వారికి సంబంధించిన శాఖలపై చర్చ చేపట్టారా?...అంటే అదీ లేదు.

ఘనంగా దుర్గామాత విగ్రహాల నిమజ్జనం



మునగపాక వీధుల్లో అమ్మవారి విగ్రహం ఊరేగింపు

మునగపాక, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి వేడుకలు మండల వ్యాప్తంగా నిర్వహించారు. గ్రామ గ్రామాన దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం పలు చోట్ల గల మండపాల్లో అమ్మవారి విగ్రహాలను నదులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. అంతకు ముందు పలువురు నాయకులు మండపాలకు వెళ్లి ఆదిమాతను దర్శించుకున్నారు.

రామన్నపాలెంలో లో వోల్టేజీ సమస్య పరిష్కారం

అచ్యుతాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. అచ్యుతాపురాన్ని ఆనుకొని ఉన్న రామన్నపాలెంలో చాలా కాలంగా లో వోల్టేజీ సమస్యతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇది గుర్తించి శనివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీంతో సమస్య పరిష్కారమైనట్టు చెప్పారు.

'సమష్టి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి'

మునగపాక, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యమని సర్పంచ్ చదరం వెంకట సూర్య గణేశ్ అన్నారు. గణపర్తి శనివారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. ఫిర్యాదులు వంటి కారణాలతో కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయన్నారు. సాగునీటి కాలువకు నష్టం కలగకుండా రేలుగెడ్డ కాలువ గట్టుపై పశువుల పాకలు వేసుకొని అనేక సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు అర్ధంతరంగా వాటిని తొలగించాలని నోటీసులు ఇవ్వడం సరికాదని పలువురు దళితులు వాపోయారు. గ్రామంలో మరోచోట స్థలం చూపిస్తే అక్కడ పశువుల పాకలు ఏర్పాటు చేసుకుంటామని విన్నవించారు. మాజీ సర్పంచ్ పీట్లా అప్పారావు, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పల్లపు ఆనందపురం లో శనివారం జరగాల్సిన గ్రామసభ వాయిదా పడింది. దండోరా వేయకపోవడం, ముఖ్యనాయకులందరికీ సమాచారం పూర్తిస్థాయిలో లేకపోవడం వల్లనే గ్రామసభకు ఎవరూ రాలేదని కూటమి నాయకులు ఆరోపించారు.

ఆటో డ్రైవర్ల సేవలో.. కూటమి సర్కారు

... 5వ పేజీ తరువాయి

చేశారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదా లేకుండా చావుదెబ్బ తీశారని విమర్శించారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న రూ.4 వేలు పెన్షన్ పథకం దేశంలో ఇతర ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. 1994 నుంచి చంద్రబాబు హయాంలో డీఎస్సీ ద్వారా 1,96,400 ఉద్యోగాలు తీశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క పోస్టు కూడా తీయలేకపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటీవల డీఎస్సీ తీసి మరో 16,347 ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.115 కోట్లు మంజూరు చేయించానన్నారు. అవసరమైతే మరో రూ.100 కోట్లు తెస్తానని తెలిపారు. నర్సీపట్నం మెడికల్ కళాశాల కోసం 2022లో సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు అడిగితే అధికారులు ఇక్కడ లేదని ఇచ్చారని తెలిపారు. ఎన్ఎంసీ అనుమతి లేకుండా మెడికల్ సీట్లు ఎలా తెస్తారని ప్రశ్నించారు. ప్రైవేటు మెడికల్ కళాశాలలో కూడా 50 సీట్లు మెరిట్ స్టూడెంట్స్‌కి ఇస్తారన్నారు. అదీ కూడా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా అయ్యారని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో తనపై పెట్టిన పోస్టుపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐని ఆయన ఆదేశించారు.

ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. ఆటో డ్రైవర్లు సంతోషంగా ఉండాలన్న ఉద్దేశంతోనే చంద్రబాబు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి ఎలా ఉండేదో ఆటో కార్మికులు అందరికీ తెలిసిందేనని అన్నారు. ఆటో మరమ్మతులు, కేసులకు వేల రూపాయలు అపరాధ రుసుములు చెల్లించాల్సి వచ్చేదని తెలిపారు. రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ రూ.4 వేలు చేశారన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ పెంచుతానని హామీ ఇచ్చి మొదటి విడత 250 పెంచారని, తరువాత ఎన్నికలు దగ్గర పడే సమయానికి వెయ్యి పెంచారని తెలిపారు. గతం కంటే పెన్షన్‌దారులు పెరిగారని తెలిపారు. రైతు బంధు పథకం కూడా గత ప్రభుత్వంలో ఇచ్చిన దానికంటే అధికంగా ఇస్తున్నామని తెలిపారు. హామీ ఇవ్వకపోయినా ఆటో డ్రైవర్లకు మేలు చేయాలన్న ఉద్దేశంతో దసరా కానుకగా వారి ఖాతాలలో రూ.15 వేలు చొప్పున జమ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో వీవీ రమణ, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు సుకల అప్పలనాయుడు, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఫలితాలు వినియోగదారులకు చేరాలి

పాయకరావుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం స్థానిక మంగవరంరోడ్డులో ఓ కల్యాణమండపంలో స్థానిక వ్యాపారులు, డీలర్లకు జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులంతా జీఎస్టీలో కొత్త విధానంలో ఉన్న రేట్లు ప్రకారమే వస్తువులు అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో దాసరి శ్రీకాంత్, తాండవ వ్యాలీ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ జీవీవీ సత్యనారాయణ, వ్యాపారులు, డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆందోళన

పాయకరావుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం ఆందోళన చేశారు. ఫ్యాప్టో పిలుపు మేరకు శనివారం వై జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎదుట ధర్నా నిర్వహించారు. తహశీల్దారు ఎస్‌పి మహేశ్వరరావుకి వినతి పత్రాన్ని అందజేశారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన ఫ్యాప్టో నాయకులు కేకేఎల్ఎన్ ధర్మరాజు (ఏపీటీఎఫ్), పి.వెంకటరావు (యూటీఎఫ్), వై.ఆనందరావు (ఎస్సీ, ఎస్టీ యూనియన్), కేఎస్ఎస్ సాయిప్రసాద్ (డీటీఎఫ్)తోపాటు పీవీ గణేష్, జేవీఎస్‌పీ రాజేశ్,డి.వెంకటరావు,డి.కొండలరావు, పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి సారె ఊరేగింపు

కోటవురట్ల. అక్టోబర్4(ఆంధ్రజ్యోతి): పాములవాకలో శనివారం దుర్గాదేవికి భక్తులు సారె సమర్పించారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే, సాయంత్రం దుర్గాదేవి ఏలేరుకాలువలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

ఎస్. రాయవరం, అక్టోబరు 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారంలకు మధ్య వరహానదిపై వంతెనపై శనివారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. రాజమండ్రి నుంచి అనకాపల్లి వైపు ఓ కారు వెళ్తుండగా, అదే సమయంలో అదే మార్గంలో వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వరహానది వంతెన గోడపైకి వెళ్లి నిలిచింది. కారులో ఉన్న డ్రైవర్‌కు ఈ ఘటనలో ప్రమాదమేమీ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు, హైవే సిబ్బంది వెంటనే చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా కారును క్రేన్ సాయంతో అక్కడి నుంచి తొలగించారు.

నిత్యం ఇదేం సంత

... 5వ పేజీ తరువాయి

రాకపోకలు సాగించేటప్పుడు ట్రాఫిక్ సమస్యతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు.

కూరగాయల మార్కెట్‌ను ఎప్పుడు తరలిస్తారో?

కరోనా తగ్గుముఖం పట్టిన తరువాత అధికారులు కూరగాయల మార్కెట్‌ను యథాతథంగా ఇందిరా మార్కెట్లోకి తరలిస్తారని ప్రజలు భావించారు. ఇందిరా మార్కెట్ వలన మండల పరిషత్‌కి సంవత్సరానికి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఆదాయం వచ్చేది. గత నాలుగేళ్ల నుంచి ఆశీలు పాట నిర్వహించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం ఆదాయానికి గండి పడింది. రైతులు, వ్యాపారులు అక్కడ కూరగాయల మార్కెట్‌కి అలవాటు పడిపోయారు. రైతులు కూరగాయలు, అరిటి గెలలు, ఆకు కూరలు తెచ్చుకొని విక్రయించుకోవడానికి అనుకూలంగా ఉండడంతో ఇందిరా మార్కెట్‌కి రావడానికి వారు ఇష్టపడడం లేదు. అధికారులు కూడా కూరగాయల మార్కెట్ సమస్యను పట్టించుకోవడం మానేయడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. దీంతో పట్టణ ప్రజలు కూరగాయలకు డిగ్రీ కళాశాల వరకు వెళ్లాల్సి వస్తున్నది.

ఆదుకోవడమే లక్ష్యంగా 'ఆటో డ్రైవర్ సేవలో'

» టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న తాతయ్యబాబు, కూటమి నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆటో డ్రైవర్లను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అన్నారు. శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ళ వరహాలబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 1,939 మందికి రూ.2,90,00,500 విడుదలయ్యాయన్నారు. అనంతరం నమూనా చెక్కును ఆటో డ్రైవర్లకు పంపిణీ చేశారు. ముందుగా వై.జంక్షన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండల అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, అమలకంటి అబద్ధం, లింగంనాయుడు, కూటమి నాయకులు పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజబాబు, వంకా వెంకటరమణ, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియంకేరి, గూటూరు శ్రీనివాసరావు, ఎం.రమాకు మారి, ఎగదాసి నానాజీ, నారపురెడ్డి పద్మ, ఆచంట దొర, నాగు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులకు సన్మానం



సర్పంచ్ వెంకట ప్రశాంతి, నరసింహమూర్తిలను సన్మానిస్తున్న దృశ్యం

ఎస్. రాయవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్ళపల్లి సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతి, నరసింహమూర్తి దంపతులను శనివారం వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గత ఆగస్టు 15న ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో జిల్లా నుంచి సర్పంచ్ వెంకట ప్రశాంతి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఈదంపతులిద్దరినీ అభినందిస్తూ గోవిందరావు ఎంపీపీ వెంకటలక్ష్మితో పాటు ఎంపీడీవో మీనాకుమారి, తహశీల్దార్ రమేశ్‌బాబు సమక్షంలో వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, రెడ్డి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక



జూడో అండ్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కోటవురట్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని పాములవాక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో అండ్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం విశాఖ జిల్లా గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి జూడో అండ్ రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన పి. గణేష్, కె. మనోజ్ అండర్ -17 విభాగంలో రాష్ట్రస్థాయిలో జూడో అండ్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈవిద్యార్థులతోపాటు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ కె. సావిత్రిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆక్సాహెబ్‌పేటలో పశు వైద్య శిబిరం

కోటవురట్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆక్సాహెబ్‌పేటలో పశువైద్యాధికారి హరిప్రియ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెట్ల నరేశ్ జీవాలకు పలు వ్యాధుల నివారణ టీకాలు వేశారు. 27 ఎదకురాని పశువులు, 23 గర్భకోశవ్యాధులు పశువులకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేశ్, సర్పంచ్,ఆవుగడ్డి ఇరేశమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

అడ్డరోడ్డు - నర్సీపట్నం రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

» చినగుమ్ములూరు సర్పంచ్ బుజ్జి నిలదీత

» ఎస్. రాయవరం మండల సమావేశానికి వైసీపీ ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు



ఆర్అండ్‌బీ ఏఈ రామన్‌ను ప్రశ్నిస్తున్న సర్పంచ్ గాడి బుజ్జి

ఎస్. రాయవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని మండలంలోని చినగుమ్ములూరు సర్పంచ్ గాడి బుజ్జి సంబంధిత ఆర్అండ్‌బీ ఏఈ రామన్‌ను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ వెంకటలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైసీపీ ఎంపీటీసీ సభ్యులెవరూ హాజరుకాకుండా దుమ్మాకొట్టారు. ఆ పార్టీ నుంచి ఒక్క ఉప్పరాపల్లిసర్పంచ్ మాత్రమే హాజరయ్యారు. దీంతో టీడీపీ ప్రతినిధులు సమస్యలను లేవనెత్తారు. చినగుమ్ములూరు సర్పంచ్ బుజ్జి అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వైపు రోడ్డు గోతులతో అధ్వానంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. సైతారుపేట సర్పంచ్ రమణబాబుతోపాటు పలువురు సర్పంచ్‌లు గ్రామాల్లో చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులు సక్రమంగా లేవన్నారు. కుళాయిలనుంచి తాగునీరు రావడంలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఏఈ భాను మాట్లాడుతూ పెనుగొలు గ్రోయిన్ నిర్మాణానికి రూ. 99 లక్షల నిధులు మంజూరయ్యాయని, సోముదేవుపల్లి వరహానది గట్టు నిర్మాణానికి రూ. 7 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. పులపర్తి చానల్ పూడికలతో ఉండడంతో సైతారుపేటతో పాటు పరిసర గ్రామాలకు సాగునీరందడం లేదని సర్పంచ్ రమణబాబు ఏఈ భాను దృష్టికి తీసుకువెళ్లారు. డిప్యూటీ డీఈవో అప్పారావునుద్దేశించి ఉప్పరాపల్లి, కోనవానిపాలెంల్లో పాఠశాలల భవనాలను పూర్తి చేయాలని పలువురు కోరారు. ఎంపీడీవో మీనాకుమారి, తహశీల్దార్ రమేశ్‌బాబు, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ అప్పారావు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'గోవాడ'ను ఆదుకోండి

... 5వ పేజీ తరువాయి

నెలాఖరు వరకు వరి నాట్లు వేశారని, ఇంత వరకు జిల్లాలో 32,615 టన్నుల ఎరువులు సరఫరా చేశామన్నారు. ఆనందపురం జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ మండలంలో మూడు గ్రామాల్లో ఇనాం రైతులకు అన్నదాత సుఖీభవ సహాయం అందలేదని ప్రశ్నించడంతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పందించి జిల్లాలో ఏడు గ్రామాల్లో ఇనాం రైతులకు అన్నదాత సుఖీభ సాయం విడుదలకు ప్రతిపాదనలు పంపామన్నారు. వైద్య ఆరోగ్యశాఖపై చర్చలో మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం ప్యాక్ చేయడానికి ఉచితంగా కిట్లు ఇవ్వాలని కోరగా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల కో- ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అటువంటి సదుపాయం లేదన్నారు. అనకాపల్లి జేసీ జాహ్నవి స్పందిస్తూ దీనిని పరిశీలిస్తామన్నారు. పరవాడ, అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని పరవాడ, అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యులు పైల సన్యాసిరాజు, లాలం రాంబాబు కోరారు. కోటవురట్ల కో-ఆప్షన్ సభ్యుడు నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ బార్క్‌కు భూములిచ్చిన రైతుల్లో కొంతమందికి ఇంత వరకు పరిహారం ఇవ్వలేదని పేర్కొనడంతో జేసీ బదులిస్తూ త్వరలో అర్హులకు పరిహారం ఇస్తామన్నారు. పరవాడ మండలం తానాం గ్రామంలో రెసిడెన్సియల్ స్కూల్‌లో ఎన్టీపీసీ సాయంతో చేపట్టిన వసతుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరావు ఆరోపించగా, జేసీ జోక్యం చేసుకుని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దశలో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ ప్రొటోకాల్ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, సీఎం, లోకేశ్ పేషీల నుంచి వచ్చే ఆదేశాలను అధికారులు పాటిస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇక్కడ ప్రొటోకాల్‌కు సీఎం, లోకేశ్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే అభ్యంతరం లేదని, సమావేశానికి రాజకీయం ఆపాదిస్తే మంచిదికాదని స్పష్టంచేయడంతో వైసీపీ సభ్యులు లేచి మాట్లాడడంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. ఎవరికి తోచిన విధంగా వారే మాట్లాడుతుండడంతో కొందరు సభ్యులు లేచి వారించినా ఫలితం లేకపోయింది. అయితే సమావేశాన్ని అదుపుచేయడంలో చైర్‌పర్సన్ విఫలమయ్యారని కొందరు వైసీపీ సభ్యులు గుసగుసలాడుకున్నారు. కాగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు వలన మత్స్యకారులకు ఇబ్బంది ఏర్పడుతుందని, అందువలన పార్కు ఏర్పాటు వద్దని కోరుతూ ప్రభుత్వానికి తీర్మానంచేయాలని కోరగా, సమావేశం అంగీకారం తెలిపింది. ఇంకా నర్సీపట్నంలో మెడికల్ కళాశాల ప్రభుత్వం పరిధిలోనే కొనసాగాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయాలని ఎమ్మెల్సీ కల్యాణి కోరడంతో సమావేశం ఆమోదించింది.



శారదా నది ఒడ్డు విగ్రహాల నిమజ్జనానికి వచ్చిన భక్తుల సందడి

ఘనంగా దుర్గామాత విగ్రహాల నిమజ్జనం

▸▸ అత్యంత భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలను జరుపుకున్న భక్తజనం

▸▸ నిత్యం కుంకుమ పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కోలాహలం

▸▸ వేడుకలు ముగియడంతో మేళతాళాల నడుమ ఊరేగించి నదిలో అనుపు

అనకాపల్లి టౌన్/కొత్తూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన ఆదిమాత దుర్గమ్మ విగ్రహాలను నిమజ్జనం చేశారు. వీధి వీధిన ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. రోజూ కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకుంటుండే వారు. ఉత్సవాలు ముగియడంతో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో విగ్రహాలను మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగించి శారదా నదిలో నిమజ్జనం చేశారు. అయితే ఇక్కడ ఎటువంటి క్రేన్‌లు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో భారీ విగ్రహాలను భవానీ మాలధారణ చేసిన భక్తులే సాహసంతో నదిలోకి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. మరికొంత మంది భక్తులు విగ్రహాలను ట్రాక్టర్లపై తీసుకువచ్చి శారదానది పాత వంతెన పైనుంచే నిమజ్జనం చేశారు. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇదిలావుంటే, నిదానందొడ్డిలోని కామాక్షిదేవి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు ముగియడంతో భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే, కొత్తూరు పంచాయతీ పరిధిలో జరిగిన అనుపోత్సవంలో సత్యనారాయణపురం కల్యాణగిరి ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోటిపల్లి కిశోర్, యడ్ల త్రినాథరావు, దుడ్డు శ్రీనివాసరావు, బోయిన రమణాజీ, ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు, మేడిశెట్టి సత్తిబాబు, వుడా కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



నదిలో దుర్గమ్మ విగ్రహం నిమజ్జనం



సత్యనారాయణపురం కల్యాణగిరిపై ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ విగ్రహం ఊరేగింపు

ఆటో కార్మికుల కుటుంబాల్లో ఆనందం

▸▸ ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం ▸▸ ఇందులో భాగంగానే 'ఆటో డ్రైవర్ల సేవలో' పేరిట ఆర్థిక సాయం : ఎమ్మెల్యే కొణతాల



ఆటో నడుపుతూ ర్యాలీని ప్రారంభించిన దృశ్యం



ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో బుద్ద, సురేంద్ర

అనకాపల్లి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ భవనంలో శనివారం 'ఆటో డ్రైవర్ల సేవలో' భాగంగా అనకాపల్లి నియోజకవర్గంలోని 2,032 మంది ఆటో డ్రైవర్లకు రూ.3,04,80,000ల ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు, వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఏడాదికి రూ.15 వేలు చొప్పున డ్రైవర్ల కుటుంబాల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ సహాయం ద్వారా ఆటో డ్రైవర్లు అప్పుల బారిన పడకుండా ఉంటారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చి కూటమి పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారతదేశానికి ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా కృషి చేస్తున్నారని వివరించారు. భారత్ అభివృద్ధిని చూసి ఓర్వలేక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన దేశంపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. స్వదేశీ వస్తువులు వాడితే ఏ దేశంపై ఆధారపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఎన్నెన్నో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. విశాఖ పట్టణాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేశామని, భవిష్యత్తులో మిగిలిన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు పీలా నాగశ్రీను, గొంతిన శ్రీను, పలకా రవి, కర్రి బాబి, చదరం నాగేశ్వరరావు, ఎంపీపీలు లీలా ప్రసాద్, గోపీకృష్ణ, హసీనా సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమావేశ మందిరం నుంచి ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆటో నడుపుతూ ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సందీప్ వినాయక వర్మ (ఫైల్ ఫొటో)

లంకెలపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పరవాడ మండలం పెదముషిడివాడ శివారు నక్క వానిపాలెం వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. సబ్బవరం మండలం పైడివాడ గ్రామానికి చెందిన సాగిరాజు సందీప్ వినాయక వర్మ(27) ద్విచక్ర వాహనంపై శుక్రవారం అనకాపల్లి వెళ్లాడు. అర్ధరాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. నక్కవానిపాలెం సమీపంలోని మలుపుల వద్దకు వచ్చే సరికి బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అతనికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతను గతంలో గాజువాకలోని ఓ బైక్ షోరూమ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేవాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. తల్లి, సోదరుడు ఉన్నారు. ఈ మేరకు పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- విశాఖపట్నం మధ్య తాడి రైల్వే స్టేషన్ సమీపం మూడు మదుముల వంతెనపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం గుర్తించినట్టు జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. విశాఖ- విజయవాడ మధ్య వెళ్లే రైలు ఢీకొనడం వల్ల సదరు వ్యక్తి మృతి చెందినట్టు ఆమె చెప్పారు. మృతుడు 5.5 అడుగుల పొడువు, నలుపురంగు జుత్తు, కుడిచేయి మణికట్టుపై ఓం అనే పచ్చబొట్టు కలిగి ఉన్నాడన్నారు. పూర్తి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాల్సిందిగా ఆమె కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 'ఫ్యాప్టో' బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ ఫ్యాప్టో ప్రతినిధులు శనివారం సాయంత్రం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ వెంటనే ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయులను కేవలం బోధనకే వినియోగించాలని, బోధనేతర పనులకు ఉపయోగించరాదని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని వారంతా నినాదాలు చేశారు. ఫ్యాప్టో ప్రతినిధులు బోయిన చిన్నా రావు, కొణతాల గణేష్, చినబ్బాయి, ఆచంట రవి, ప్రకాష్, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'జీఎస్టీలో సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు'

సబ్బవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం జీఎస్టీలో తీసుకు వచ్చిన సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. శనివారం ఇక్కడి పంచాయతీ కార్యాలయం ఆవరణలో 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరిట ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. జీఎస్టీలో సంస్కరణల వలన ప్రజల కొనుగోలు శక్తి పెరిగి తద్వారా జీవన ప్రమాణాలు మెరుగు పడతా యన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పీఏసీఎస్ డైరెక్టర్ పల్ల తాతా రావు, డిప్యూటీ ఎంపీడీవో డి.చైతన్య, కార్యదర్శి వై.రాజేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పొతల కనకరాజు, కొల్లి కృష్ణ, శేఖర్‌తో పాటు వార్డు సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కశింకోటలో ఉరుసు ఉత్సవం



గుర్రంపై చందనాన్ని ఊరేగింపుగా తీసుకువెళుతున్న ముస్లింలు

కశింకోట, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) శనివారం ఇక్కడ ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుక శుక్రవారం ప్రారంభమైంది. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో హాజరై ఖాదరీబాబా సమాధిని దర్శించుకొని ప్రార్థనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చందనాన్ని దర్గా నుంచి ఖాదరీబాబా ఇంటి వరకు, మళ్ళీ అక్కడి నుంచి దర్గా వరకు సాంప్రదాయంగా గుర్రంపై తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు చిక్కం గురు ప్రసాద్, సభ్యులు సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాదరీ, హాజీ సయ్యద్ జాఫర్ అలీ, సయ్యద్ జిలానీ, సయ్యద్ అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మదీనా మసీదులో జెండా పండుగ

కొత్తూరు : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ ఇస్లాంపేటలో ఉన్న మదీనా మసీదులో గార్వీ షరీఫ్ ముబారక్ జెండా పండుగ ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్లాంపేట కూడలిలో ఏర్పాటు చేసిన పతాకాన్ని శనివారం ముస్లిం మత పెద్దలు దావూద్ ఆలీ, ఇబ్రహీం, సలీమ్, బాషా, మౌలానా, ఖాజీ అలీ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్ఎస్ఎస్, కేజీఎస్ యూత్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వంట పాత్రలు, సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న డీజీఎం గిరిధరరావుభక్షి

పరవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాంకీ ఫౌండేషన్, విశాఖ ఫార్మాసిటీ సంయుక్త ఆధ్వర్యంలో తాడి గ్రామంలో గల మినీ అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన వంట పాత్రలు, కుర్చీలు, ఇతర సామగ్రిని సమకూర్చారు. వీటిని శనివారం రాంకీ అగ్నిమాపక కేంద్రం వద్ద విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరరావుభక్షి చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్‌కు అందజేశారు. ఇప్పటి వరకు 12 అంగన్‌వాడీ కేంద్రాలు, తొమ్మిది పాఠశాలలకు వంట పాత్రలు, ఇతర సామగ్రి అందజేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె. శ్రీకాంత్, ఉమెన్ కో-ఆర్డినేటర్ ఎస్.రాజేశ్వరి, శ్రీనివాస్, శశిధర్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ కాలనీలో అభివృద్ధి పనులకు చర్యలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏఎంసీ కాలనీ అభివృద్ధికి జోనల్ అధికారులు శనివారం చర్యలు ప్రారంభించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ కాలనీని సందర్శించి ఇక్కడ తక్షణమే అభివృద్ధి పనులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు అధికారులు దెబ్బతిన్న ఇంటి శ్లాబులను కొలతలు తీసి, తిరిగి శ్లాబులు వేసేందుకు, నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాము కాటుతో ఒకరి మృతి

పరవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపిన వివరాలివి. పి.బోనంగి గ్రామానికి చెందిన బిళ్లకుర్తి రమేష్ (41) శుక్రవారం సాయంత్రం ఆవులకు గడ్డి కోసేందుకు పొలంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో అయన పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు పరవాడ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'దేశ ఆర్థిక ప్రగతిలో సంస్థల వ్యవస్థాపకుల పాత్ర కీలకం'



చంద్రమోహన్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న వీసీ

సబ్బవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక ప్రగతిలో సంస్థల వ్యవస్థాపకుల (ఇంట్రప్రెన్యూర్స్) పాత్ర ఎంతో కీలకమని తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రమోహన్ అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం 'క్వాలిటీస్ ఆఫ్ ఇంట్రప్రెన్యూర్స్ అండ్ లీడర్స్ ఇన్ ది కార్పొరేట్ వరల్డ్' అంశంపై విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. భారతదేశంలో అనేక మంది ఇంట్రప్రెన్యూర్స్ సరికొత్త ఆలోచనలతో తమ వ్యవస్థలను ముందుకు కొనసాగిస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. ఇంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలంటే ఎలాంటి లక్షణాలు ఉండాలో విద్యార్థులకు ఆయన వివరించారు. మారుతున్న పరి స్థితులకు అనుగుణంగా వ్యవస్థాపకులు లేదా ఇంట్రప్రెన్యూర్స్ తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని వివరించారు. సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి సాధిస్తూ అనేక మందికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వగలిగినప్పుడే భారతదేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు అందించినట్టు అవు తుందన్నారు. వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ వినూత్నమైన ఆలోచనలతో వర్సిటీని దేశంలోనే ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సదస్సులో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఏసీబీ పేరిట ఫోన్ కాల్స్ వస్తే నమ్మొద్దు'

అనకాపల్లి రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొంత మంది నకిలీ వ్యక్తులు తాము అవినీతి నిరోధకశాఖ అధికారులమని చెప్పి ప్రభుత్వ ఉద్యోగులను మోసగించే ఘటనలు జరుగుతున్నాయని, అటువంటి వారి పట్ల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అవినీతి నిరోధకశాఖ విశాఖ రేంజ్ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీబీ అధికారుల పేర్లను ఉపయోగించి ఫోన్‌కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, అటువంటి కాల్స్ ఎవరికైనా వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏసీబీ అధికారులు ఎప్పుడూ ఫోన్ ద్వారా డబ్బులు, ఇతర ప్రయోజనాలు అడగరన్నారు. ఏసీబీ పేరుతో డబ్బులు అడిగే వారు పూర్తిగా మోసగాళ్లు అని, అలాంటి ఫోన్ కాల్స్ ను ప్రభుత్వ ఉద్యోగులు నమ్మరాదన్నారు.

'అధ్వాన రహదారులను బాగు చేయాలి'

తుమ్మపాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలో అధ్వానంగా ఉన్న రహదారులను బాగు చేయాలని బీఎస్పీ నాయకుడు సూదికొండ మాణిక్యాలరావు కోరారు. అస్తవ్యస్తంగా మారిన తుమ్మపాల మెయిన్ రోడ్డును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారుల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తుమ్మపాల మెయిన్ రోడ్డు ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో పాటు చినబాబు కాలనీ వద్ద వర్షం పడితే చెరువును తలపిస్తుందన్నారు. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారన్నారని వాపోయారు. అలాగే మార్టూరు, సీహెచ్ఎన్ అగ్రహారం, దిబ్బపాలెం తదితర రహదారుల సైతం దెబ్బతిన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

▸▸ డివైడర్ పైనుంచి దూసుకొచ్చి కారును ఢీకొన్న కంటైనర్ లారీ

▸▸ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు ▸▸ తాడి మూడు మదాల వద్ద ఘటన

లంకెలపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జాతీయ రహదారిలోని మూడు మదాల వద్ద శనివారం పెను ప్రమాదం తప్పింది. ఓ కంటైనర్ లారీ డివైడర్ పైనుంచి దూసుకొచ్చి కారును ఢీకొంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. అనకాపల్లి నుంచి గాజువాక వస్తున్న కంటైనర్ లారీ సరిగ్గా తాడి మూడు మదాల వద్దకు వచ్చేసరి అదుపు తప్పి డివైడర్ పైనుంచి దూసుకొచ్చింది. ఆ సమయంలో గాజువాక నుంచి విజయవాడ దుర్గమ్మ గుడికి వెళుతున్న కారును ఢీకొంది. అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న నలుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కంటైనర్ డివైడర్‌పై బోల్తా పడడంతో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డివైడర్‌పై బోల్తా పడిన లారీ (అంతర్ చిత్రం) స్వల్పంగా దెబ్బతిన్న కారు

లంకెలపాలెం ప్రధాన మార్గంలో పొంచి ఉన్న ప్రమాదం

▸▸ జగనన్న కాలనీ సమీపంలో కల్వర్టుకు రక్షణ గోడ కరువు

▸▸ రాకపోకలకు భయాందోళన చెందుతున్న వాహనదారులు



జగనన్న కాలనీ సమీపంలో రక్షణ గోడ లేకుండా ఉన్న కల్వర్టు

పరవాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ నుంచి ఫార్మాసిటీ మీదుగా లంకెలపాలేనికి వెళ్లే ప్రధాన మార్గంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. జగనన్న కాలనీకి కూతవేటు దూరంలో ఉన్న ఈ కల్వర్టు రక్షణ గోడ దెబ్బతిని కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, అచ్యుతాపురం, ఎస్ఈజెడ్‌తో పాటు పరిసర గ్రామాలకు వెళ్లే పాదచారులు, వాహనదారులతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఏ మాత్రం వాహనాలు అదుపు తప్పినా గెడ్డ వాగులోకి పడటం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. చుట్టూ చీకటిగా ఉండడంతో ఇప్పటికే పలు వాహనాలు బోల్తా పడ్డాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పరవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఆటోడ్రైవర్‌కు సాయం అందినట్టు ఫోన్ మెసేజ్ చూపుతున్న ఎమ్మెల్సీ గ్రీష్మ, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర



చింతపల్లిలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

ఆటో డ్రైవర్ల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ గ్రీష్మ
- 'ఆటో డ్రైవర్ సేవలో' అమలు
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

అరకులోయ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు వారికి ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోందని టీడీపీ అధికార ప్రతినిధి,విజయనగరంనకు చెందిన ఎమ్మెల్సీ గ్రీష్మ అన్నారు. శనివారం టీడీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో నిర్వహించి ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఆఫీస్ ప్రాంగణంలో జరిగిన సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,90,669 మంది ఆటో డ్రైవర్లకు గాను రూ.436 కోట్లు నిధులు జమచేశారన్నారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 4215 మంది ఆటోడ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున నిధులు జమచేశారన్నారు. అరకులోయ మండలంలో 1686 మంది లబ్ధి పొందారన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆటోడ్రైవర్లు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు : ఏఎంసీ చైర్‌పర్సన్ ఊర్మిళ

చింతపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం అమలు చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నాయకులు ఆటోడ్రైవర్లతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో పింఛన్ నగదు పెంచిందన్నారు. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేసిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్. సీతామహాలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు, ఏఎంసీ డైరెక్టర్లు చిన్న, సేవా ఈశ్వరమ్మ, కేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, టీడీపీ నాయకులు రీమల ఆనందరావు, నాగభూషణం, వల్లి, గాంధీ పడాల్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఆటో డ్రైవర్ల సేవా పథకం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం కూటమి నేతలు, ఆటో డ్రైవర్లు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకం అమలుతో ఆటో డ్రైవర్లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి జి.రామ్మూర్తి, సర్పంచ్‌లు వి.లక్ష్మణ్, వి.దనియా, టీడీపీ మండల అధ్యక్షురాలు కె.సన్యాసమ్మ, కూటమి నేతలు ఎస్. బాబూజీ, కె.జగన్నాయ్, పి.కామేశ్వరరావు, బి.రామారావు, ఎం.చిన్నిబాబు, ముకుందపడాల్, వి.రామస్వామి ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడకూడదనే..

కొయ్యూరు: ఎన్నికల ముందు హామీ ఇవ్వకున్నా ఆటో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి రూ. 15 వేల సాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వం వాహన మిత్ర పథకంలో ఆటో కార్మికులకు శనివారం రూ. 15 వేలు వారి ఖాతాలలో జమ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం కాకరపాడు కూడలిలో ఆటో కార్మికులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎన్. శ్రీను, సర్పంచ్ బాలరాజు, బీజేపీ నేతలు చంద్రరావు, రాజు, టీడీపీ నేతలు బాచీ, గోవిందు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు, ఆటో డ్రైవర్లు



కాకరపాడులో ఆటో కార్మికులతో టీడీపీ నేత ప్రసాద్

గంజాయి రవాణాపై అప్రమత్తం : డీఎస్పీ

అనంతగిరి, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల ముసుగులో గంజాయి రవాణాకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని పాడేరు డీఎస్పీ షెహబాజ్ అహ్మద్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం డీఎస్పీ వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. స్టేషన్ నిర్వహణ రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులకు సంబంధించి వివరాలనుఅడిగితెలుసుకున్నారు. అలాగే, గంజాయి కేసులు, రోడ్డు ప్రమాదాలపై ఆరా తీశారు. స్టేషన్‌లోని సీసీ కెమెరాలు పనితీరు పరిశీలించారు. అనంతరం డీఎస్పీ ఆయన మాట్లాడుతూ.. సిబ్బందితో మాట్లాడుతూ ఫిర్యాదుదారులపట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని, అసాంఘిక కార్యకలపాలకు అడ్డకట్ట వేయాలని ఆదేశించారు. గురువారం ఈదురుగాలులకు స్టేషన్‌పై చెట్టు విరిగిపడిన దిబ్బతిన్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరకు సీఐ హిమగిరి, ఎస్ఐ డి.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అనంతగిరి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ షెహబాజ్ అహ్మద్

ఆటో డ్రైవర్ల సేవలో.. కూటమి సర్కారు

... 5వ పేజీ తరువాయి

చేశారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదా లేకుండా చావుదెబ్బ తీశారని విమర్శించారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న రూ.4 వేలు పెన్షన్ పథకం దేశంలో ఇతర ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. 1994 నుంచి చంద్రబాబు హయాంలో డీఎస్సీ ద్వారా 1,96,400 ఉద్యోగాలు తీశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క పోస్టు కూడా తీయలేకపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటీవల డీఎస్సీ తీసి మరో 16,347 ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. నర్సీపట్నంనియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.115 కోట్లు మంజూరు చేయించానన్నారు. అవసరమైతే మరో రూ.100 కోట్లు తెస్తానని తెలిపారు. నర్సీపట్నం మెడికల్ కళాశాల కోసం 2022లో సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు అడిగితే అధికారులు ఇక్కడ లేదని ఇచ్చారని తెలిపారు. ఎన్ఎంసీ అనుమతి లేకుండా మెడికల్ సీట్లు ఎలా తెస్తారని ప్రశ్నించారు. ప్రైవేటు మెడికల్ కళాశాలలోనూ 50 సీట్లు మెరిట్ స్టూడెంట్స్‌కి ఇస్తారన్నారు. అదీ కూడా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా అయ్యారని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో తనపై పెట్టిన పోస్టుపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐని ఆయన ఆదేశించారు.

ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. ఆటో డ్రైవర్లు సంతోషంగా ఉండాలన్న ఉద్దేశంతోనే చంద్రబాబు ఆటో డ్రైవర్లు సేవలో పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి ఎలా ఉండేదో ఆటో కార్మికులు అందరికీ తెలిసిందేనని అన్నారు. ఆటో మరమ్మతులు, కేసులకు వేల రూపాయలు అపరాధ రుసుములు చెల్లించాల్సి వచ్చేదని తెలిపారు. రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ రూ.4 వేలు చేశారన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ పెంచుతానని హామీ ఇచ్చి మొదటి విడత 250 పెంచారని, తరువాత ఎన్నికలు దగ్గర పడే సమయానికి వెయ్యి పెంచారని తెలిపారు. గతం కంటే పెన్షన్‌దారులు పెరిగారని తెలిపారు. రైతు బంధు పథకం కూడా గత ప్రభుత్వంలో ఇచ్చిన దానికంటే అధికంగా ఇస్తున్నామని తెలిపారు. హామీ ఇవ్వకపోయినా ఆటో డ్రైవర్లకు మేలు చేయాలన్న ఉద్దేశంతో దసరా కానుకగా వారి ఖాతాలలో రూ.15 వేలు చొప్పున జమ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో వీవీ రమణ, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు సుకల అప్పలనాయుడు, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

గోవాడను ఆదుకోండి

... 5వ పేజీ తరువాయి

నెలాఖరు వరకు వరి నాట్లు వేశారని, ఇంత వరకు జిల్లాలో 32,615 టన్నుల ఎరువులు సరఫరా చేశామన్నారు. ఆనందపురం జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ మండలంలో మూడు గ్రామాల్లో ఇనాం రైతులకు అన్నదాత సుఖీభవ సహాయం అందలేదని ప్రశ్నించడంతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పందించి జిల్లాలో ఏడు గ్రామాల్లో ఇనాం రైతులకు అన్నదాత సుఖీభ సాయం విడుదలకు ప్రతిపాదనలు పంపామన్నారు. వైద్య ఆరోగ్యశాఖపై చర్చలో మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం ప్యాక్ చేయడానికి ఉచితంగా కిట్లు ఇవ్వాలని కోరగా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల కో- ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అటువంటి సదుపాయం లేదన్నారు. అనకాపల్లి జేసీ జాహ్నవి స్పందిస్తూ దీనిని పరిశీలిస్తామన్నారు. పరవాడ, అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని పరవాడ, అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యులు పైల సన్యాసిరాజు, లాలం రాంబాబు కోరారు. కోటవురట్ల కో-ఆప్షన్ సభ్యుడు నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ బార్క్‌కు భూములిచ్చిన రైతుల్లో కొంతమందికి ఇంత వరకు పరిహారం ఇవ్వలేదని పేర్కొనడంతో జేసీ బదులిస్తూ త్వరలో అర్హులకు పరిహారం ఇస్తామన్నారు. పరవాడ మండలం తానాం గ్రామంలో రెసిడెన్సియల్ స్కూల్‌లో ఎన్టీపీసీ సాయంతో చేపట్టిన వసతుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరావు ఆరోపించగా, జేసీ జోక్యం చేసుకుని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దశలో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ ప్రొటోకాల్ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, సీఎం, లోకేశ్ పేషీల నుంచి వచ్చే ఆదేశాలను అధికారులు పాటిస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇక్కడ ప్రొటోకాల్‌కు సీఎం, లోకేశ్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే అభ్యంతరం లేదని, సమావేశానికి రాజకీయం ఆపాదిస్తే మంచిదికాదని స్పష్టంచేయడంతో వైసీపీ సభ్యులు లేచి మాట్లాడడంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. ఎవరికి తోచిన విధంగా వారే మాట్లాడుతుండడంతో కొందరు సభ్యులు లేచి వారించినా ఫలితం లేకపోయింది. అయితే సమావేశాన్ని అదుపుచేయడంలో చైర్‌పర్సన్ విఫలమయ్యారని కొందరు వైసీపీ సభ్యులు గుసగుసలాడుకున్నారు. కాగా రాజ్యసభ్య సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు వలన మత్స్యకారులకు ఇబ్బంది ఏర్పడుతుందని, అందువలన పార్కు ఏర్పాటు వద్దని కోరుతూ ప్రభుత్వానికి తీర్మానంచేయాలని కోరగా, సమావేశం అంగీకారం తెలిపింది. ఇంకా నర్సీపట్నంలో మెడికల్ కళాశాల ప్రభుత్వం పరిధిలోనే కొనసాగాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయాలని ఎమ్మెల్సీ కల్యాణి కోరడంతో సమావేశం ఆమోదించింది.

చెరువులు కళకళ

... 5వ పేజీ తరువాయి

కుంటలను తవ్వకాల పనులను అధికారులు ప్రారంభించారు.

ఇందులో ఆగస్టు నెలాఖరు నాటికి 4,122 పంట కుంటల తవ్వకాల పనులు పూర్తి చేశారు. వీటిలో బుచ్చెయ్యపేట మండలంలో 183, అనకాపల్లిలో 78, అచ్యుతాపురంలో 186, చీడికాడలో 139, చోడవరంలో 189, దేవరాపల్లిలో 198, గొలుగొండలో 163, కె.కోటపాడులో 238, కశింకోటలో 197, మాడుగులలో 189, మాకవరపాలెంలో 240, మునగపాకలో 205, నక్కపల్లిలో 67, నర్సీపట్నంలో 150, నాతవరంలో 126, నాతవరంలో 219, పరవాడలో 44, పాయకరావుపేటలో 80, రాంబిల్లిలో 172, రావికమతంలో 288, రోలుగుంటలో 291, ఎస్.రాయవరంలో 165, సబ్బవరంలో 182, ఎలమంచిలి మండలంలో 133 ఉన్నాయి. అన్ని మండలాల్లో పంట కుంటలను తవ్వడం, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడంతో ఈ ఏడాది భూగర్భ జలాలు పెరగడమే కాకుండా సాగునీటి అవసరాలకు నీరు పుష్కలంగా అందనున్నదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. రైతులకు పండ్ల జాతి మొక్కలను పంపిణీ చేసి వాటిని పంట కుంట గట్లపై నాటించి అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళిక అమలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

నిత్యం ఇదేం సంత

... 5వ పేజీ తరువాయి

రాకపోకలు సాగించేటప్పుడుట్రాఫిక్ సమస్యతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు.

కూరగాయల మార్కెట్‌ను ఎప్పుడు తరలిస్తారో?

కరోనా తగ్గుముఖం పట్టిన తరువాత అధికారులు కూరగాయల మార్కెట్‌ను యథాతథంగా ఇందిరా మార్కెట్లోకి తరలిస్తారని ప్రజలు భావించారు. ఇందిరా మార్కెట్ వలన మండల పరిషత్‌కి సంవత్సరానికి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఆదాయం వచ్చేది. గత నాలుగేళ్ల నుంచి ఆశీలు పాట నిర్వహించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం ఆదాయానికి గండి పడింది. రైతులు, వ్యాపారులు అక్కడ కూరగాయల మార్కెట్‌కి అలవాటు పడిపోయారు. రైతులు కూరగాయలు, అరిటి గెలలు, ఆకు కూరలు తెచ్చుకొని విక్రయించుకోవడానికి అనుకూలంగా ఉండడంతో ఇందిరా మార్కెట్‌కి రావడానికి వారు ఇష్టపడడం లేదు. అధికారులు కూడా కూరగాయల మార్కెట్ సమస్యను పట్టించుకోవడం మానేయడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. దీంతో పట్టణ ప్రజలు కూరగాయలకు డిగ్రీ కళాశాల వరకు వెళ్లాల్సి వస్తున్నది.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'



మంత్రి సంధ్యారాణి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేత సూర్యనారాయణ

పాడేరురూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏ, నాన్ ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న 417 మంది భాషా పండితులు, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా మార్పు చేసి పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేగం సూర్యనారాయణ కోరారు. శనివారం ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెను స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకులతో కలిశారు. ఈ సందర్భంగా 2014 జూన్ 2వ తేదీకి ముందు నుంచి ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని, 1983లో ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. డీఎస్సీ 2025కు ముందు ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న ఖాళీలలో ఇన్ సర్వీస్ సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు కుర్తాడి రామారావు, సంఘం నాయకులు సీహెచ్. చిట్టిపడాల్, ఒ.విజేంద్రనాద్ పాల్గొన్నారు.

దాత సాయంతో పాఠశాలకు మరమ్మతులు



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

పెదబయలు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మారుమూల పర్రెడ గ్రామంలో శిథిలావస్థకు చేరి ప్రాథమిక పాఠశాల భవనాన్ని దాత సాయంతో పునరుద్ధరించారు. స్థానిక సర్పంచ్ రవిశంకర్ ఈ పాఠశాల దుస్థితిపై అనేకమార్లు ఉన్నత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త తరుణ్ యువకుడు దృష్టికి ఈ పాఠశాల దుస్థితిని తీసుకువెళ్లారు. ఆయన రూ. 50 వేల ఆర్థిక సాయమందించారు. స్థానిక ఎస్ఎంసీ ఉపాధ్యాయుడు ఆదినారయణ, పెసా కమిటీ ప్రతినిధి నీలకంఠం, సోమేష్ పాఠశాలను మరమతులు చేయించారు. శనివారం ఎంఈవో కొమ్ము కృష్ణ మూర్తి ఈ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'కాఫీ తోటల రైతులకు పరిహారం చెల్లించాలి'

గూడెంకొత్తవీధి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో కాఫీ తోటలు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ అన్నారు. శనివారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రంపుల నుంచి పెదవలస వరకు హైవే నిర్మాణంలో ఆదివాసీలు కాఫీ తోటలు, వ్యవసాయ భూములను కోల్పోతున్నారన్నారు. వెంటనే బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలన్నారు. అలాగే పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ, పోరంబోకు భూముల వివరాలను పంచాయతీ వీఆర్వో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనందరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిని వైసీపీ నేతలు అడ్డుకోలేరు

- త్వరలో విశాఖకు వన్నె తేనున్న గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు
- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

పాడేరురూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో చేపడుతున్న రాష్ట్రాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ కంపెనీలు త్వరలోనే విశాఖకు వన్నెతెస్తాయన్నారు. రాష్ట్రాన్ని గ్లోబల్ మ్యాప్‌పై నిలిపేందుకు కూటమి ప్రభుత్వం ప్రఖ్యాత కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తోందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలి, వాటి ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం కృషి చేస్తుంటే.. వాటిని అడ్డుకోవడమే పనిగా వైసీపీ వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. ఇటీవల విశాఖలో టీసీఎస్ ఏర్పాటును అడ్డుకునేందుకు వైసీపీ నేతలు పావులు కదిపారన్నారు. ఈ కంపెనీ స్థాపనకు ప్రభుత్వం 99పైసలకే భూమి కేటాయిస్తే దానిపై హైకోర్టుకు వెళ్లి చీవాట్లు తిన్నారన్నారు. అయినా, అడ్డంకులు అధిగమించి టీసీఎస్ భవన నిర్మాణం పూర్తయి, త్వరలోనే సంస్థ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. విశాఖకు మరో ప్రపంచ దిగ్గజ సంస్థ గూగుల్‌ను రప్పించేందుకు మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోఐటీ శాఖ అహర్నిశలు కష్టపడిందన్నారు. చివరకు రూ. 50-55 వేల కోట్ల పెట్టుబడితో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ సంస్థ ముందుకువచ్చిందన్నారు. భీమిలి నియోజకవర్గం తర్లువాడలో ఈ సెంటర్ ఏర్పాటుకు రైతుల నుంచి సేకరించిన 200 ఎకరాలను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ. 17 లక్షలు ప్రకటించినప్పటికి రైతుల విజ్ఞప్తి మేరకు రూ. 19.55 లక్షల చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. గూగుల్ సంస్థ రాష్ట్రానికి వస్తే రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడం కష్టమని భావించిన వైసీపీ నాయకులు వారి బినామీ పేర్లతో ఉన్న భూములను కాపాడుకునేందుకు కోర్టులో కేసులు వేశారన్నారు. అయినా, గూగుల్ డేటా సెంటర్, రాష్ట్ర ప్రగతిని ఎవరూ అడ్డుకోలేరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు సాయిరాం, రాష్ట్ర కనీస వేతనాల కార్పొరేషన్ సభ్యులు సుబ్బారావు, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి సుబ్బారావు, దారెల సర్పంచ్ పాండురంగ స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్

ఘనంగా దుర్గాదేవీ అనుపోత్సవం

పాడేరురూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పాడేరు మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన దేవి విగ్రహ అనుపోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత నెల 29వ తేదీ సోమవారం నుంచి ఈ నెల 4వ తేదీ శనివారం వరకు 6 రోజులు దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం దుర్గాదేవి మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం దుర్గాదేవి విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా పట్టణ పురవీధుల్లో భారీ బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించి అనుపోత్సవాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు వి.మోదవెంకటసత్యనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, పి.మాణిక్యాలరావు, వి.గోపి, బి.నూకరాజు, ఎ. వెంకటరమణ, వై.శ్రీనివాస్, కమిటీ ప్రతినిధులు కె.సింహాచలం నాయుడు, కె.రామారావు, డి. బాబూరావు, జి.శివకుమార్, పి.ఈశ్వరరావు, ఎస్.సూర్యప్రకాశ్, పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలో దుర్గాదేవి అనుపోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక రంగా సెంటర్‌లో వద్ద దుర్గాదేవి మండపంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఊరేగింపుగా అమ్మవారిని చౌడుపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.



చింతపల్లిలో దుర్గాదేవి ఊరేగింపు



పాడేరులో అమ్మవారి ఊరేగింపు

రాజరాజేశ్వరి దేవికి పట్టు వస్త్రాలు, ఆభరణం బహూకరణ

పాడేరురూరల్: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న రాజరాజేశ్వరి దేవికి పాతపాడేరుకు చెందిన బత్తిని గౌరీశంకర్, భవానీ దంపతులు, బత్తిని రాంజీ, రవణమ్మ దంపతులు పట్టు వస్త్రాలతో పాటు 1 గ్రామ్ గోల్డ్ నక్లెస్‌ను శనివారం ఆలయ కమిటీ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతుల చేతుల మీదుగా అందించారు. ఈ దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, ఉప్పల వెంకటరత్నం, దెశిది బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు అందిస్తున్న దంపతులు

జడ్పీలో రాజకీయం

... 5వ పేజీ తరువాయి

కైన జడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతం లేదా జిల్లాలో ప్రధాన సమస్యలను సమావేశంలో ప్రస్తావించి అవి పరిష్కారం అయ్యేలా చూడాల్సి ఉంది. కానీ, కొందరు ఆ విషయం వదిలేసి ఒకే అంశంపై లేనిపోని సందేహాలతో గంటలకొద్దీ చర్చ కొనసాగిస్తున్నారు. ప్రస్తుత జడ్పీ పాలక వర్గం ఏర్పడి గత నెల 23వ తేదీకి నాలుగేళ్లు పూర్తయ్యింది. శనివారం నాటి సమావేశంతో కలిపి ఈ నాలుగేళ్లలో 17 సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. శనివారం సమావేశంలో సభ్యులతో పాటు చైర్‌పర్సన్ కూడా కూడా నేరుగా అధికారులపై విమర్శలకు దిగడం చర్చనీయాంశమైంది. సభా వేదిక నుంచే అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌కు ఫోన్ చేసి 'జిల్లా నుంచి ఎక్కువ మంది అధికారులు రాకపోవడానికి మీ నిర్లక్ష్యమే కారణం' అంటూ వ్యాఖ్యానించడంతో పలువురు అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. సమావేశంలోనే ఉన్న విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు ప్రధానంగా కలెక్టర్లకు ప్రభుత్వ కార్యక్రమం తొలి ప్రాధాన్యం, జడ్పీ సమావేశం రెండో ప్రాధాన్యం అంటూ జడ్పీ సమావేశం వాయిదా వేసుకుని ఉండాల్సిందని పేర్కొనడం గమనార్హం. కాగా అల్లూరి జిల్లా అనంతగిరిలో రెండు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వంలోనే వచ్చాయి. వాటిపై అప్పట్లో మౌనంగా ఉన్న వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఇప్పుడు వ్యతిరేకించడం ఏమిటని సమావేశంలో సభ్యుడొకరు వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే వైసీపీ హయాంలో జిల్లాలో రహదారులు అత్యంత అధ్వానంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక రోడ్లను బాగుచేయించింది. కానీ ఆ విషయం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా విమర్శలు చేయడంతో రాజకీయ లబ్ధికోసమేననే అభిప్రాయం వ్యక్తమైంది. ఇక, ఒక్క అంశాన్ని పట్టుకుని గంటల తరబడి సాగదీస్తున్నారు. ఇదే విషయాన్ని విపక్ష నేత బొత్స సత్యనారాయణ శనివారం ప్రస్తావించి అన్ని అంశాలకు సమయం కేటాయించాలన్నారు. సమావేశం మధ్యలో ఆయన వెళ్లిపోయిన తరువాత సమస్యలను పక్కనపెట్టి ప్రొటోకాల్ అంశంపై సభ్యులు చర్చించడం గందరగోళానికి దారితీసింది. ప్రతి అంశానికి నిర్దిష్ట సమయం నిర్ణయించి చర్చించేలా అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్‌పర్సన్ చూడాలి. గడచిన నాలుగేళ్లలో అసలు చర్చకు రాని శాఖలే ఎక్కువగా ఉన్నాయి. అయినా ఆయా శాఖల అధికారులు సమావేశాలకు హాజరు కావాలని ఆదేశిస్తారు. దీంతో రోజంతా వారు జడ్పీలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. శనివారం సమావేశాలకు హాజరుకాని అధికారులను జడ్పీ అధికారులు ఆగమేఘాలపై పిలిపించారు. వారికి సంబంధించిన శాఖలపై చర్చ చేపట్టారా?...అంటే అదీ లేదు.

కార్మికుల కష్టాలు గుర్తించే ఏకైక నేత చంద్రబాబు

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు » సందడిగా 'ఆటో డ్రైవర్ల సేవలో'




ఆటో డ్రైవర్ల సేవలో పథకం చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు... (ఇన్‌సెట్‌లో) ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల కష్టాలను గుర్తించే ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కొనియాడారు. మండల కేంద్రంలో శనివారం 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అందించే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు అమలు చేసి వారికి అండగా నిలిచారన్నారు. అంతకు ముందు ఆటో డ్రైవర్ యూనిఫాం ధరించిన ఎమ్మెల్యే రాజు, కొద్ది సేపు ఆటోను నడపడంతో డ్రైవర్లు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, కనిశెట్టి మత్స్యరాజు, ఎర్రంశెట్టి చిన్న, సకురు కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ పెదబాబు, బీజేపీ నాయకులు కందర్ప రమణమూర్తి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గూనూరు మూలినాయుడు, వార్డు సభ్యులు తానవరపు శ్రీను, జనసేన నేత కర్రి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మంజులవాణి, తహశీల్దార్ లక్ష్మీదేవీ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సహకార సంఘం అధ్యక్షుడు సత్యారావు, సర్పంచ్ పెంటమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, కూటమి నాయకులు పుప్పాల అప్పలరాజు, రామ్మూర్తినాయుడు, దీవి శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్థిక సాయంపై ఆటోవాలాల ఆనందం

మాడుగుల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సొంత ఆటో, క్యాబ్ కలిగిన డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేలు అందించడంతో లబ్ధిదారుల్లో ఆనందం కనిపిస్తున్నదని ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ ఆవరణలో చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాడుగుల నుంచి సుమారు వంద ఆటోల్లో దేవరాపల్లిలో జరిగిన కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పుప్పాల లక్ష్మీనారాయణ, రమేశ్, వడ్డాది బాబు, లెక్కల కాశిబాబు, మరువాడ ఈశ్వరరావు, ఆటో యూనియన్ నేత సుందర్రాజు పాల్గొన్నారు.

రోలుగుంటలో 498 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి

రోలుగుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 498 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూరిందని ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. రోలుగుంటలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 498 మంది లబ్ధిదారులకు రూ.15 వేలు చొప్పున రూ.74.7 లక్షలను లబ్ధిదారుల ఖాతాలో జమచేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో 24 పంచాయతీల నుంచి ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర, ఎంపీటీసీ సభ్యులు సుర్ల రామకృష్ణ, గుములూరు చంద్రమౌళి, బంటు చిరంజీవి తదితరుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.



రోలుగుంటలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

అన్ని వర్గాలకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రాజరాజేశ్వరి పెట్రోల్ బంకు నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు ఆటోలో ర్యాలీగా వచ్చారు. అనంతరం చెక్కు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో, ట్యాక్సీ యజమానులకు ఇచ్చిన మాట అమలు చేసిన ఏకైక సీఎం చంద్రబాబునాయుడు మాత్రమేనని చెప్పారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలో సుమారు 2,420 మందికి రూ.15 వేలు చొప్పున రూ.3.63 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కాగా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే ఆర్టీవో కార్యాలయ అధికారులు ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌లో ఆటో యజమానుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు.




బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు... (ఇన్‌సెట్‌లో) కార్యకర్త నడుపుతున్న ఆటోలో కూర్చొన్న ఎమ్మెల్యే

సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

బుచ్చెయ్యపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని విశాఖ డెయిరీ డైరెక్టర్ జి.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇవ్వగా, కూటమి ప్రభుత్వం రూ.15 వేలు అందిస్తున్నదన్నారు. మండలంలో 516 మంది ఈ పథకంలో లబ్ధి పొందారన్నారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎంపీడీవో శివప్రసాద్, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎమ్‌వీ.సత్యనారాయణ, నాయకులు జి.కోటేశ్వరరావు, వి.అప్పారావు, ఎస్.లక్ష్మి, కె.రవి, డి.కిశోర్, డి.అప్పలనాయుడు, ఎస్.రమేశ్, డి.గిరిబాబు పాల్గొన్నారు.

రావికమతంలో 450 మందికి...

రావికమతం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 450 మంది డ్రైవర్లు ఆటో డ్రైవర్ల సేవలో లబ్ధి పొందారని టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరరావు చెప్పారు. శనివారం ఈ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో కుటుంబాలను ఆదుకోవాలన్న ఆకాంక్షతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి ప్రభుత్వం పత్యేక యాప్ రూపొందించే యోచనలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు, వజ్రపు శివ, గల్లా రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.32 లక్షలతో గోకులం షెడ్ల నిర్మాణం: ఎమ్మెల్యే రాజు

చోడవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.32 లక్షలతో 18 గోకులం షెడ్లు నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఖండేపల్లిలో గోకులం షెడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ దశల వారీగా గోకులం షెడ్లు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఉపాధి పథకం ఏపీడీ శ్రీనివాసరావు, నాయకులు మాణిక్యం, అప్పారావు, వరహాలు, శ్రీనివాసరావు, సూరిబాబు పాల్గొన్నారు.

19న జిల్లా స్థాయి యోగా పోటీలు

చోడవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక ఉషోదయ విద్యా సంస్థల్లో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీశ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు విశాఖలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులు ఈ ఏడాది డిసెంబరు 27 నుంచి 29వ తేదీ వరకు ఇండియన్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనదల్చిన క్రీడాకారులు 9291276900 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అందుబాటులో లింగ నిర్ధారణ వీర్యం

కె.కోటపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆడ దూడలు మాత్రమే పుట్టేందుకు లింగ నిర్ధారణ వీర్యం అందుబాటులో ఉందని విశాఖపట్నం జిల్లా పశు సంవర్థకశాఖ డీడీ రెడ్డి నీలయ్య తెలిపారు. మండలంలోని పోతనవలస గ్రామంలో శనివారం గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ దూడల వీర్యం ఇంజక్షన్ గతంలో రూ.250 ఉండగా, ప్రస్తుతం రూ.150కే ఇస్తున్నట్టు చెప్పారు. కురువాడ, చౌడువాడ పశు వైద్యాధికారులు సింహాచలంనాయుడు, సిహెచ్.ఎర్రునాయుడు పశువులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి సౌజన్య, ఏహెచ్ఏలు హనుమంతు, సుధ, మంగ, గోపాలమిత్ర, ఓఎస్ దేముడు, సర్పంచ్ సిరికి భవాని, గ్రామ నాయకుడు వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా నిరసన

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు మాట్లాడుతూ మత్స్యకారుల ఉపాధి, మనుగడను దెబ్బతీసే బల్క్‌డ్రగ్ పార్కును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ క్రాంతి, జిల్లా కార్యదర్శి ఫణీంద్రకుమార్, రైతు సంఘం నేత బాబులు పాల్గొన్నారు.

గోవాడ ఫ్యాక్టరీ రైతులను ఆదుకోవాలి

మాడుగుల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో పూర్తిస్థాయి క్రషింగ్ చేసి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆధునీకీకరణ పనులకు నిధులు మంజూరు చేయించి 26 వేల మంది సభ్య రైతులు రోడ్డున పడకుండా చూడాలని కోరారు. రైతులు పండించిన చెరకు పూర్తి స్థాయిలో క్రషింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పాతరపల్లి రాంబాబు, రైతు సంఘం మండల అధ్యక్షుడు పిల్ల అప్పారావు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కామిరెడ్డి పాత్రునినాయుడు ఉన్నారు.



సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గ్రామీణ క్రీడలకు పూర్వ వైభవం

» శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడలకు పూర్వ వైభవం తీసుకువచ్చి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం కృష్ణాదేవిపేట జడ్పీ హైస్కూల్‌లో అల్లూరి సీతారామరాజు మెమోరియల్ 12వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ బాలుర, బాలికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను స్పీకర్ పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతీ జిల్లాలో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగేవని, రానురాను వాటి ప్రాధాన్యత తగ్గిదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా ఒకప్పుడు వాలీబాల్ క్రీడాకారుడిగా రాష్ట్రస్థాయి వరకు వెళ్లాలని గుర్తు చేసుకున్నారు. పోటీల నిర్వహణకు తన వంతు రూ.50 వేలు విరాళం అందిస్తున్నట్టు ప్రకటించారు. ఇక్కడ గెలిచిన జట్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాయని అయ్యన్నపాత్రుడు తెలిపారు. పోటీల్లో బాలుర విభాగంలో 13 జట్లు, బాలికల విభాగంలో 13 జట్లకు చెందిన 416 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఎంఈవో-2 కృష్ణప్రసాద్, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్, నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, ఎ.గోపాలకృష్ణ, చిటికెల సాంబమూర్తి, జనసేన నేత సూర్యచంద్ర, సాఫ్ట్‌బాల్ సంఘ నాయకులు మామిడి రమణ, ఎంవీ రమణ, శ్రీనివాసరావు, సమంత్‌రెడ్డి, సూర్య, దేవుడు, సతీశ్, భవానీ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ తారకేశ్వరరావు సేవలు ప్రశంసనీయం



ఎస్ఐ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కృష్ణాదేవిపేట,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట ఎస్ఐగా వైతారకేశ్వరరావు అందించిన సేవలు ప్రశంసనీయమని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం ఎస్ఐ కుటుంబ సభ్యులను గ్రామస్థుల తరపున స్పీకర్ సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంలో కృషి చేసి డిపార్టుమెంట్‌కే గుర్తింపు తెచ్చారన్నారు. ఎస్ఐ తారకేశ్వరరావును అందరూ ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎంఈవో కృష్ణప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

సమస్యలపై ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ

నర్సీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీబీఎం కాంపౌండ్ నుంచి పెదబొడ్డేపల్లి వరకు ర్యాలీ సాగింది. ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి వై.సుధాకరరావు మాట్లాడుతూ డీఏలు మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ కమిటీ నియమించాలని కోరారు. ఫ్యాప్టో నాయకులు పడాల అప్పారావు, జి.చిట్టియ్య, జానకీరామ్ నాయుడు, దొర పాల్గొన్నారు.

చోడవరంలో...

చోడవరం: మండల కేంద్రంలో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ సాగింది. 12వ పీఆర్సీ కమిటీని నియమించలేదని, ఐఆర్, డీఏ కూడా ప్రకటించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.మహాలక్ష్మినాయుడు, చోడవరం అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, మల్లేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, యూటీఎఫ్ నేతలు సూర్యప్రకాశ్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం వస్తువులతో డ్వాక్రా మహిళలకు బురిడీ

» మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



వెలుగు మార్ట్ ద్వారా బలవంతపు కొనుగోళ్లు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తున్న భీమబోయినపాలెం ఎంపీటీసీ సభ్యుడు

మాకవరపాలెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వెలుగు మార్ట్ ద్వారా నాసిరకం వస్తువులను విక్రయిస్తూ డ్వాక్రా మహిళలను మోసం చేస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ అధికారి అప్పారావు మాట్లాడుతూ రైతులకు సరిపడినంత యూరియా రైతుసేవా కేంద్రాల్లో ఉందన్నారు. ఈ ఏడాది ఉపాధి పనులు గుర్తించేందుకుగాను అక్టోబరు 2 నుంచి 15వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.36 కోట్లతో పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని ఏపీవో కాశినాయుడు తెలిపారు. ఏడు పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరయ్యానని, ఒకొక్క భవనానికి రూ.35 లక్షల చొప్పున నిధులు వచ్చాయని పంచాయతీరాజ్ శాఖ జేఈ సోమశేఖర్ తెలిపారు. మండలంలో సుమారు 1400 కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని, 24 గంటలూ విద్యుత్ సరఫరా అందజేస్తున్నామని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ బాలకృష్ణ తెలిపారు.

అనంతరం వెలుగు ఏపీఎం మంగ మట్లాడుతుండగా భీమబోయినపాలెం ఎంపీటీసీ సభ్యుడు అడ్డు తగిలారు. వెలుగు మార్ట్‌లో సుమారు రూ.2500 సామగ్రి కొంటేనే రుణాలు ఇస్తామని మహిళలపై బెదిరింపులకు దిగుతున్నారన్నారు. తీరా సామగ్రి నాసిరకం కావడంతో ఎలా కొనమంటారని ఆయన నీలదీశారు. వెలుగు మార్ట్‌లో సామగ్రి బలవంతంగా కొనుగోలు చేస్తున్న ప్రతీ మహిళా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. దీనిపై సమావేశంలో ఇప్పటికే పలుమార్లు చర్చించినా వెలుగు అధికారుల తీరు మారలేదన్నారు. ఈ బలవంతపు కొనుగోళ్లు అపేలా మండల పరిషత్ తీర్మానం చేయాలని ఆయన సభ్యులను కోరారు. అనంతరం ఇతర శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరును సభ్యులకు తెలియజేశారు. అయితే అధిక శాతం సర్పంచులు, ఎంపీటీసీలు, సభ్యులు, పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో తూతూమంత్రంగా ముగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రాజారావు, లక్ష్మి, ఈవోపీఆర్‌డీ మేరీజోన్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చెట్టుపల్లి విద్యార్థులు

నర్సీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింట్ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం అనకాపల్లిలో ఎస్‌కేపీ పవర్ జిమ్‌లో జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చెట్టుపల్లి జెడ్పీహెచ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈసీహెచ్ కావ్య 43 కిలోల విభాగం, ఎం.మణి 47 కిలోలు, ఎం.లక్ష్మీదేవి 52 కిలోలు, ఎం.అమృతవల్లి 69 కిలోలు, ఎస్.భాస్కర్ 66 కిలోల విభాగంలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయిని శ్రీదేవి తెలిపారు. అలాగే శ్రీసాయి కళాశాల విద్యార్థిని ఎ.అపూర్వజ 57 కిలోలు, డాన్ భాస్కర్ స్కూల్ విద్యార్థిని పి.సాయి సౌజన్య 63 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు.

వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేయాలి

మాడుగుల రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డి.పట్టా భూముల రైతుల పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని టీడీపీ నాయకులు, రైతులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఉర్లలోవ కొండలో 314 మంది రైతులకు 444.26 ఎకరాలు, నాగళ్లకొండలో 469 మంది రైతులు 654.47 ఎకరాలు, కొప్పు కొండమ్మ రెవెన్యూ పరిధిలో 56 మంది రైతులకు 84.69 ఎకరాల డి.ఫారం పట్టాలు ద్వారా పాసు పుస్తకాలు పొందామని, వాటి వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నామని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉండూరు దేముడు, సర్పంచ్ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉర్లలోవ భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు కమిటీ

రావికమతం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉర్లలోవ రెవెన్యూ పరిధిలోని డి.పట్టా సాగు భూములకు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.వెంకన్న, కె.గోవిందరావు తెలిపారు. కొమిర గ్రామంలో సాగుదారులతో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సాగుదారుల పోరాట ఫలితంగానే ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఈ మేరకు జేసీ, చైర్మన్‌గా, నర్సీపట్నం, అనకాపల్లి ఆర్డీవోలు, జిల్లా సర్వేయర్, అసిస్టెంట్ సర్వేయర్, తహశీల్దార్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్డు సిద్ధం



వాహన రాకపోకలు సాగిస్తున్న తాచేరు డైవర్షన్ రోడ్డు ఇదే..

బుచ్చెయ్యపేట అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్డు రాకపోకలకు సిద్ధమైంది. ఈ రోడ్డు నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేశారు. ఎమెల్యే రాజు చెప్పినట్లే సకాలంలో అందుబాటులోకి తీసుకువచ్చి అన్ని వాహనాలకు అనుమతి ఇచ్చారు. ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో రవాణా కష్టాలు తీరినట్టేనని వాహన చోదకులు, స్థానిక ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత జీవోలను అనుసరించే ఇప్పుడు జీవోలు

» మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర గణేశ్



జీవో కాపీని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం వైద్య కళాశాల ఏర్పాటు చేయడానికి గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నాలుగు జీవోలను అనుసరించే ప్రస్తుత ప్రభుత్వం పీపీపీ విధానంలో ఇవ్వడానికి జీవో ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ అన్నారు. పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు జీవో లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరోపిస్తున్నారని, గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అనుసరించే ఇప్పటి ప్రభుత్వం జీవోలు ఇచ్చిందని చెప్పారు. వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వలసంపేటలో తాగునీటి ఇక్కట్లు

నాతవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలసంపేట గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. నెల రోజులుగా గుక్కెడు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. సచివాలయం దగ్గర వీధిలో ఉన్న కుళాయిలను తొలగించి సిమ్మెంట్ రోడ్డు, కాలువల నిర్మాణం చేపట్టారని, ఇది జరిగి నెల రోజులు దాటుతునా కొత్తగా కుళాయిలు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకునే పరిస్థితి వస్తోందని మహిళలు తెలిపారు. అధికారులు స్పందించి వల్సంపేటలో తాగునీటి ఇబ్బంది లేకుండా కుళాయిలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

భూ సమస్యలపై ప్రజావేదిక

గొలుగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ చైన్లు ఆధ్వర్యంలో భూ సమస్యలపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాదేవిపేటకు చెందిన రైతులు, ఇరు వర్గాలతో మాట్లాడారు. రెవెన్యూ రికార్డులు వచ్చే ప్రజావేదికలో తమకు అందించాలని ఇరు వర్గాలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

చీడికాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని ఇట్స్‌మై విలేజ్ అసోసియేషన్ సభ్యులు బొబ్బిలి మధు తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. కంటి సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న రోగులు తమ ఆధార్ కార్డుతో పాటు వైద్య శిబిరానికి రావాలని ఆయన సూచించారు.